క్లుప్తంగా

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి

● ఎస్పీ కృష్ణకాంత్



సుంకేసుల డ్యాం చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

గూడూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని పోలీసు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఆంధ్ర–తెలంగాణ సరిహద్దు సుంకేసుల డ్యాం చెక్ పోస్టును మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నగదు, మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు, అనుమతులు లేని సరుకుల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పట్టుబడిన వస్తువులను సీజ్ చేసి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ ఉన్నారు.

నేడు సచివాలయాల ప్రారంభోత్సవం



కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామ సచివాలయం-1, సచివాలయం-2 భవనాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓ రమణమూర్తి మంగళవారం తెలిపారు.


'గిరిజన' విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మేరీ సలోమీ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలోని విద్యార్థినులు జూడో గేమ్స్‌లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేరీసలోమీ తెలిపారు. మంగళవారం ఆమె కోచ్ కోచ్ సోమసుందర్‌రెడ్డితో కలిసి విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థినులు గంగోత్రి, కీర్తి, పూజ ప్రతిభ చాటారన్నారు.

అక్రమ భవన నిర్మాణాలపై వేటు



రిచ్‌మండ్ విల్లాస్‌లో డివియేషన్ నిర్మాణాలను నిలిపి వేసిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక కోడుమూరు రోడ్డులో ఉన్న రిచ్‌మండ్ విల్లాస్‌లో అనుమతులు లేకుండా (డివియేషన్) చేపడుతున్న నిర్మాణాలపై మంగళవారం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వేటు వేశారు. పనులను నిలుపుదల చేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండటంతో అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, చైన్‌మన్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాల దారులకు రెండు సార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ప్లాన్‌కు విరుద్ధంగా పార్కింగ్ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చేస్తామని హెచ్చరించారు.

తైక్వాండోలో బంగారు పతకం

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బుధవారపేట నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థి యాసర్ బాషా అండర్-17 విభాగంలో బంగారు పతకం సాధించాడు. పాఠశాల ఏజీఎం రమేష్‌కుమార్, ఏఓ తిమ్మారెడ్డి ఆ విద్యార్థినిని మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

కర్నూలు (టౌన్) : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి, కేసీ కెనాల్ వద్ద అభివృద్ధి చేస్తున్న చిరు వ్యాపారుల సముదాయం, కెనాల్ బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయిని పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

వంట పాత్రలూ వచ్చేశాయ్!

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. నాడు–నేడు కింద పాఠశాలలను తీర్చిదిద్దిన ప్రభుత్వం.. జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు స్కూల్ డ్రెస్, షూ, బెల్ట్, పుస్తకాలు అందజేసింది. గోరు ముద్ద కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందజేస్తోంది. ఇప్పు డు వంట పాత్రలు అందజేసి వంట సిబ్బందికి కష్టాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. – గడివేముల



● మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు సరఫరా
● మండల వ్యాప్తంగా 37 పాఠశాలలకు పంపిణీ
● వంట సిబ్బందికి తీరనున్న ఇబ్బందులు



బూజునూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మండలంలో 37 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2010లో అప్పటి ప్రభుత్వం పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు పంపిణీ చేసింది. ఆ తరువాత వచ్చిన టీడీపీ సర్కారు వీటి గురించి పట్టించుకోలేదు. అరకొర పాత్రలతోనే వంటలు చేయాల్సి వచ్చేది. కొన్ని స్కూల్స్ వంట పాత్రలు లేకపోగా, వాటిని ఏజెన్సీకి చెందిన మహిళలే సమకూర్చుకున్నారు. వంట పాత్రలు లేక ఇబ్బందిగా ఉందని గత ప్రభుత్వంలో వంట నిర్వహణ మహిళలు విన్నవించినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు మూడు రకాల వంట పాత్రలు అందజేశారు.

మా ఇంటి నుంచి తెచ్చుకునేటోళ్లం



వంట పాత్రలు 13 ఏళ్ల క్రితం ఇచ్చారు. కొన్నాళ్లకే పోయాయి. స్కూల్‌లో 120 మంది విద్యార్థులు ఉన్నారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన పాత్ర ఒకటే ఉంది. వంటకు ఇబ్బంది అవుతుంటే మా ఇళ్లలో నుంచి పాత్రలు తెచ్చుకుని పిల్లలకు వండి పెడుతున్నాం. ఇప్పుడు ప్రభుత్వం వంట పాత్రలు ఇవ్వడం సంతోషకరం.
– మిద్దె లక్ష్మీదేవి, తూడిచెర్ల లక్ష్మిదేవి, వంట ఏజెన్సీ మహిళలు

37 పాఠశాలలకు వంట పాత్రలు మంజూరు



జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు 2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాలల వారీగా ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిర్ణయించిన కేటగిరీల ప్రకారం వంట పాత్రలు కోసం ప్రతిపాదనలు పంపాం. 37 పాఠశాలలకు మంజూరు కావడంతో వాటిని హెచ్‌ఎంల ద్వారా వంట ఏజెన్సీ మహిళలకు అందజేశారు. – విమల వసుంధరా దేవి, ఎంఈఓ -2, గడివేముల

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్నూలు మండలం రేమట గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్య లు, సంక్షేమ పథకాల లబ్ధి, ప్రభుత్వ పని తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. పిల్లలను బడికి పంపి ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు. 8వ తరగతి చదువుతున్న ఓ బాలికను పలకరిస్తూ మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని ఆరా తీయగా ఇంట్లో కంటే బాగుంటుందని, కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావా ఇస్తున్నారని సమాధానం ఇచ్చింది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.ప్రసన్నకుమార్, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, స్థానిక నాయకుడు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు అందించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీడీ విజేయుడు

సి.బెళగల్: పశువులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ విజేయుడు పశువైద్యులకు సూచించారు. మంగళవారం ఆయన సి.బెళగల్, పోలకల్ పశువైద్యశాలలను తనిఖీ చేశారు. రికార్డులను, మందుల నిల్వలు, వినియోగం తదితర అంశాలపై ఆరా తీశారు. వైద్యులు రెగ్యులర్‌గా విధులకు హాజరవుతూ, పశువులకు సరైన సమయంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. పాడి రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను, అర్హులైన వారికి పశు సంక్షేమ పథకాలను అమలయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. డీడీ వెంట డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, రీచర్డ్స్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

● మండల సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: పెండింగ్ పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మేకలబండలో ఇల్లు నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు 15 రోజులు గడువు ఇవ్వాలన్నారు. అంతలోపు నిర్మాణం చేపట్టకపోతే వారికి రద్దు చేసి ఇతరులకు కేటాయించాలన్నారు. రసూల్లాపేట సమీపంలో గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను మరోమారు పరిశీలించాలని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు సూచించారు. బపలనూరు సొసైటీ భవనాన్ని గ్రామైఖ్య సంఘానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై సొసైటీ సీఓతో చర్చిస్తామన్నారు. నెరవాడ గ్రామానికి హైవే నుంచి పుట్టాలమ్మ గుడి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. బడిబయటి పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలన్నారు.

చెక్కుల పంపిణీ

పీఎంఈజీపీ కింద మండలానికి మంజూరైన రెండు యూనిట్లకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు అందించారు. పాణ్యం మండల కేంద్రానికి చెందిన జ్యోత్స్న ఎంబ్రాయిడింగ్, మద్దూరుకు చెందిన యశోద కందుల మిషన్ ఏర్పాటుకు రూ.2 లక్షల చొప్పున మంజూరైందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. కొత్తగా కళాశాల ఏర్పాటైందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, సిబ్బంది, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. కళాశాల అభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం కళాశాలలో పూర్తి సౌకర్యాలకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, మండల ఇంజినీరు మహబూబ్‌బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఎంఈఓ కోటయ్య, పీఎం ప్రసాద్, ఎంపీడీఓ దస్తగిరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



ఈసీజీ రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం రేమట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ డాక్టర్లు విజయమాధురి, ముక్తార్‌బాషాతో పాటు పలువురు వైద్యులు హాజరై 505 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 291 బీపీ, 271 మందికి షుగర్, 40 మందికి యూరిన్, 137మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. 34 మందికి ఈసీజీ చేశారు. 11 మందికి ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు.



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నీటి సంఘాల ఏర్పాటుకు చర్యలు

రైతులు ముందుకు వస్తే నీటి సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. లిఫ్ట్ విషయంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న నాయకులు అభివృద్ధి చేయకుండా ప్రజలను వంచించారన్నారు. ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆయన సొంత గ్రామంలోనే గుడి నిర్మిస్తామంటే కూడా అడ్డు తగిలారన్నారు. అలాంటి వాళ్లను ఇన్ని ఏళ్లుగా భరించిందిచాలని, వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ అనురాధ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుదర్శన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, స్థానిక నాయకులు సంపత్‌కుమార్, ఎం.సురేష్, వి.సురేష్, అబ్రహాం, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఆర్.కొంతలపాడు మద్దిలేటి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురష్కరించుకుని కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల కడుపు కొడుతోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్‌లో ఏఐటీయూసీ చేసే పోరాటాలు, ఉద్యమాలకు కార్మికులందరు భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్న, ఆటో మధు, రాజు, శేషు, కుమార్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సి.బెళగల్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ సందీప్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముడుమాల, గుండ్రేవుల గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంగళ, గురు, శనివారాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేట్టాలని పంచాయతీల కార్యదర్శులకు సూచించారు.

సారా విక్రేత అరెస్టు

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన గడిగరేవుల వెంకటస్వామి సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు నిర్వహించామన్నారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 521 మంది హాజరై వైద్య సేవలు పొందారు. డాక్టర్ మొల్లా జబీన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలువురుకి బీపీ, షుగరు, హెచ్‌బీ, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మండ్ల మమత, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేశ్వరరెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, ఏరాసు స్వామిరెడ్డి, ఉప్పరి మునిస్వామి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పింది చేశాం.. ప్రజల వద్దకు వెళ్తున్నాం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం కాబట్టే ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బలపనూరు గ్రామంలో గడప గపడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేసి, వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. గ్రామంలో పర్యటన సందర్భంగా మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డిని కలిసి గ్రామాభివృద్ధి గురించి, పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మి, మండల కో– ఆప్షన్ సభ్యులు, జాకీర్, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, నర్ల శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామరెడ్డి, రామచంద్రుడు, రాముడు, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పటేల్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ

– చిన్నటేకూరు సమీపంలో సీఈఎస్ ఫార్మసీ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిప్రకాష్, ఎన్ఎస్ఎస్ బృందం, కోఆర్డినేటర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

– **సి.బెళగల్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో మానహారం నిర్వహించారు. జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్) : రోడ్డు రవాణా సంస్థలో అప్రెంటిషిప్ చేసేందుకు ఐటీఐ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జోనల్ శిక్షణ కళాశాల మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటర్ మెకానిక్, వెల్డర్, పెయింటర్, మిషనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ విభాగాల్లో ఖాళీగా ఉన్నాయని, ఆయా విభాగాల్లో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిషిప్ ఇండియా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వివరాలకు 7382869399, 7382873146 నంబర్లకు సంప్రదించాలని తెలిపింది.

ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ సేవలు నిలుపుదల

● ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశించినా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ఉన్న ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ మిషన్ నిర్వాహకులపై వేటుపడింది. మంగళవారం ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ముందుగా ఎంఆర్‌ఐ, సీటీస్కాన్‌ల విద్యుత్ బకాయిలపై ఆరా తీశారు. మొక్కుబడిగా కొద్దిమొత్తం చెల్లించారని, ఇంకా ఎంఆర్‌ఐ వారు రూ.56.91లక్షలు, సీటీస్కాన్ వారు రూ.26.29 లక్షలు చెల్లించాల్సి ఉందని, పలుమార్లు పిలిచి చెప్పినా వారు బకాయిలు చెల్లించడం లేదని ఆసుపత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ మిషన్ల సేవలు నిలుపుదల చేయించాలని ఆసుపత్రి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ మిషన్ సేవలను ఆసుపత్రి అధికారులు ఆపు చేయించారు. తాత్కాలికంగా ప్రత్యామ్నాయ చర్యలు సైతం తీసుకున్నారు. ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల ద్వారా సీటీ స్కాన్ సేవలు అందించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో కొత్తగా ఏర్పాటైన సీటీ స్కాన్ మిషన్ సిద్ధమైందని, బుధవారం మధ్యాహ్నం నుంచి దానిని ప్రారంభించి సేవలు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. ఎంఆర్‌ఐ స్కాన్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ నిర్వాహకులకు పలుమార్లు హెచ్చరించినా వినకపోవడం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే సేవలు ఆగిపోయిన సీటీస్కాన్ మిషన్ కేంద్రం ముందు మంగళవారం సాయంత్రం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


● జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త రామకృష్ణ రావ్



పత్తి పంటను పరిశీలిస్తున్న ఎరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ రావ్

కల్లూరు: శాస్త్రవేత్తల సూచనలు పాటించి పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్, శాస్త్రవేత్త (సస్య రక్షణ) డాక్టర్ ఎ.రామకృష్ణరావ్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని సల్కాపురం, ఎ.గోకులపాడు, లక్ష్మిపురం గ్రామాల పరిధిలో సాగైన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ పత్తి పంటలో ప్రస్తుతం రసం పీల్చు పురుగులు (పచ్చ దోమ, తామర పురుగు) ఆశిస్తాయని, వాటి నివారణకు వేప నూనె 10000 పిపిఎమ్ః 2మీ.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరానికి 10 నుంచి 20 పసుపు, నీలి రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి రసాయన పురుగు మందులు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ/లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా/ లీ లేదా దయోమిధాక్జమ్ 0.2 గ్రా/లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మెగ్నీషియం ధాతు లోప నివారణకు 10 గ్రాముల మెగ్నీషియమ్ సల్ఫేట్ లీటరు నీటికి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు 20 చొప్పున పెట్టుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వీఏఏ సుజాత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన బెల్లం ఆంజనేయులు

కర్నూలు : కల్లూరు మండలం ఈశ్వరప్ప నగర్‌లో నివాసముంటున్న బెల్లం ఆంజనేయులు (41) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఈయన కల్లూరులోని ఆయిల్ మిల్లో కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. కల్లూరు మండలం శివప్ప నగర్‌లో ఉన్న సొంత స్థలంలో ఇటీవల కొట్టం నిర్మించుకుని సైడ్ గోడలకు కరెంటు మోటర్ ద్వారా క్యూరింగ్ చేస్తుండగా మంగళవారం ఉదయం మోటర్‌కు ఉన్న కరెంటు సప్లయ్ వైర్ కొద్దిగా తెగి ఆంజనేయులు పై పడటంతో సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా ముక్కులో రక్తస్రావమై అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య కురువ బెల్లం వరలక్ష్మి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.